

సాగుపేరుతో భూమి.. చేస్తున్నదేమి

సాగు నిమిత్తం దేవదాయశాఖ భూమిని వేలంలో దక్కించుకున్న కూటమి నాయకుడు అక్రమ కట్టడాలు, పంక్చర్ షాపు, హోటల్ ఏర్పాటు చేసి అద్దె వసూలు చేస్తున్నాడు.

- 8లో..



1.60 కేజీల గంజాయి పట్టివేత

పుల్లలచెరువు మండలంలోని ఐటీ వరంలో 1.60 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
40 /30

వాతావరణం

పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

నాగులుప్పలపాడు:

రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. గురువారం ఉదయం జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణతో కలిసి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు పరిశీలించారు. పేషెంట్ ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ ట్రాకింగ్ విధానాన్ని కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని ఎన్టీఆర్ వైద్య సేవల కౌంటర్ను, రోగుల రిజిస్ట్రేషన్ గదిని సందర్శించి రిజిస్ట్రేషన్ రికార్డ్స్ ను, క్యాజువాలిటీ గదులు, అత్యవసర సేవా విభాగం, ల్యాబ్ తదితర విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ ఒనారియల్ ఉన్నారు.

అందుబాటులోకి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు



క్యూ ఆర్ కోడ్‌తో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులు

ఒంగోలు సబర్బన్:

'మన మిత్ర – ప్రజల చేతిలో ప్రభుత్వం' ద్వారా వాట్సాప్ గవర్నెన్స్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై రూపొందించిన క్యూ ఆర్ కోడ్ సేవలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 161 ప్రభుత్వ సేవలను మొదటిసారిగా అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ సేవలు సాంకేతికంగా సురక్షితంగా ఉంటాయని, ప్రజల గోప్యతకు అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు ప్రభుత్వం స్పష్టం చేసిందని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా తొలి దశలో 161 ప్రభుత్వ సేవలు, రెండో విడతలో 360 రకాల సేవలను వాట్సాప్‌లోనే అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. వాట్సాప్ ద్వారా వివిధ సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ సమాచారం కూడా ప్రజలకు తెలియజేస్తామన్నారు. ఇందుకోసం 9552300009 మొబైల్ నంబర్‌ను వాట్సాప్ ద్వారా వినియోగించుకోవచ్చని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి, డీపీఓ వెంకట నాయుడు, డీఆర్‌డీఏ పీడీ నారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, సీపీఓ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు పాల్గొన్నారు.



చిత్రమైన అవినీతి..!

- ఉపాధి హామీ పథకంలో పెచ్చుమీరిన అక్రమాలు
- అందినకాడికి మేసేస్తున్న పచ్చ తమ్ముళ్లు
- ఇష్టారాజ్యంగా జాబ్‌కార్డుల నమోదు
- పనులు చేయకుండానే కూలి
- దొంగ మస్టర్లతో జేబులు నింపుకుంటున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- వారానికి రూ.3 కోట్లు పంచుకుంటున్నారు : డీఆర్‌సీలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీల నేతలు ఉపాధి హామీ పథకాన్ని హైజాక్ చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అప్పటి వరకు పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. వారి స్థానంలో టీడీపీ కార్యకర్తలు, నాయకులను పట్టుబట్టి మరీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకుని అక్రమాలకు తెరదీశారు. అందినకాడికి మేసేస్తున్నారు. నాలుగు రోజుల కిందట ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డీఆర్సీ సమావేశంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో వారానికి రూ.3 కోట్లు వసూలు చేస్తున్నారని ఆరోపించడం సంచలనం సృష్టించింది. దీంతో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది.

జిల్లాలో దోపిడీ ఇలా...

జిల్లాలో మొత్తం 4.42 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. 2024–25లో కోటీ 29 లక్షల పనిదినాలు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు. సుమారు 3 లక్షల కార్డులకు చెందిన 5.06 లక్షల మంది పనులు చేసినట్లు చెబుతున్నారు. రికార్డుల్లో ఇదంతా బాగానే ఉంది. కానీ, వాస్తవంలో మాత్రం అధికారులు చెబుతున్న దానికి విరుద్ధమైన పరిస్థితి కనిపిస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిజానికి మే నెలలో 3 లక్షల మందికిపైగా పనులు చేయాల్సి ఉంది. కానీ 1.80 లక్షల మంది మాత్రమే పనులకు వెళ్తున్నట్లు తెలుస్తోంది. మిగతా 1.20 లక్షల మంది ఎందుకు పనులకు రావడం లేదంటే అధికారుల నుంచి సమాధానం లేదు.

వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులు...

ఉపాధి హామీ పనులు చేసేవారికి గతంలో 14 రోజులకు ఒకసారి వేతనాలు ఇచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వేతనాలు ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం గత మార్చి 16వ తేదీ వరకు చేసిన పనుల తాలూకా వేతనాలు ఇటీవలే ఇచ్చారు. తిరిగి మార్చి 17 నుంచి చేసిన పనులకు ఇంత వరకు ఇవ్వలేదు. 60 రోజులు కావస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడంతో ఉపాధి కూలీలు అవస్థపడుతున్నారు. నిధులున్నా ఉద్దేశపూర్వకంగానే వేతనాలు ఇవ్వడం లేదని ప్రజాసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేసే కుట్రతోనే కూటమి ప్రభుత్వం వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికితోడు ప్రభుత్వం కనీస వేతనం రూ.307 ప్రకటించింది. కానీ, ఎవరికీ కనీస వేతనం ఇవ్వడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. చేసిన పనులకు కొలతలు వేసి వేతనం ఇవ్వడం జరుగుతోంది. దీని ప్రకారం ఒక్కొక్కరికి రూ.200 దక్కడమే మహాభాగ్యమని ఉపాధి కూలీలు చెబుతున్నారు.

ఒకటే ఫొటో.. పది బిల్లులు...

ఉపాధి హామీలో కూలీల గ్రూపు ఫొటో చూస్తే ఎవరైనా విస్తుపోవాల్సిందేనని చెబుతున్నారు. కూలీలతో పనులు చేయించినట్లు ఎన్ఎంఎంఎస్ యాప్‌లో గ్రూపు ఫొటోలు పెట్టాల్సి ఉంటుంది. అయితే, పది మందితో పది గ్రూపుల ఫొటోలు సృష్టిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పని ప్రాంతంలో దగ్గరగా ఉన్న వారిని ఫొటోలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. విద్యార్థులు, ఆశా వర్కర్లు, వికలాంగులు, చిన్నపిల్లలు, వృద్ధుల ఫొటోలు తీసుకుని అప్‌లోడ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒక ఫొటోను అనేక పంచాయతీలలో అప్‌లోడ్ చేస్తున్నట్లు సమాచారం. ఇదంతా జిల్లా అధికారులకు తెలియదా అంటే.. అంతా తెలిసే జరుగుతుందనే మాట వినిపిస్తోంది. మరి జిల్లా అధికారులు ఏం చేస్తున్నారంటే నెలనెలా మామూళ్లు తీసుకుని చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల అవినీతే ఉపాధి హామీకి శాపంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బేస్తవారిపేట మండలం మోక్షగుండం గ్రామానికి చెందిన ద్వారకచర్ల రవికుమార్‌రెడ్డి, సావిత్రి దంపతులు హైదరాబాద్‌లో నివసిస్తుంటారు. రవికుమార్‌రెడ్డి ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. ఆయన పేరుపై మోక్షగుండంలో ఉపాధి హామీ జాబ్‌కార్డు ఉంది. ఇదే గ్రామానికి చెందిన సీహెచ్ సునీత, తిరుపతిరెడ్డి గుంటూరులో నివాసం ఉంటుంటారు. పోలయ్య, లక్ష్మీదేవి కడప, నాగేశ్వరరెడ్డి, మధులత విజయవాడలో ఉంటారు. ఆవుల జ్యోతి, రమణారెడ్డి కర్ణాటకలో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. వీరందరికీ వారి స్వగ్రామాల్లో ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయి. అంతేగాకుండా వారు ప్రతిరోజూ పనులు చేస్తున్నట్లు హాజరు వేస్తున్నారు. ఇంకా చిత్రమేమిటంటే అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న వారికి కూడా వారి స్వగ్రామాల్లో ఉపాధి హామీ జాబ్‌కార్డులు ఉన్నట్లు సమాచారం.



విజయవాడ, మార్కాపురంలో ఉన్నవారి పేర్లతో హాజరు

దొంగ మస్టర్లతో నిధులు స్వాహా...

జిల్లాలో దొంగ మస్టర్ల వివాదం సంచలనం సృష్టిస్తోంది. ప్రతి మండలంలోనూ దొంగ మస్టర్ల దందా నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకులతో కుమ్మక్కైన అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్టర్లకు తెరదీసినట్లు చెప్పుకుంటున్నారు. ఒక్కో మండలంలో 5 నుంచి 7 వేల మంది వరకు ఉపాధి పనులకు హాజరవుతున్నట్లు నమోదవుతోంది. వాస్తవానికి అందులో సగం మంది కూడా ఫీల్డ్‌లో కనిపించడం లేదు. ఇటీవల పుల్లలచెరువు మండలంలోని మర్రివేములలో రికార్డుల్లో చూపిన సంఖ్య కంటే ఫీల్డ్‌లో పనులు చేస్తున్న కూలీలు చాలా తక్కువగా కనిపించడంతో తనిఖీకి వెళ్లిన అధికారులు వామ్మో అంటూ నోరెళ్లబెట్టినట్లు తెలిసింది. ఉదయం 150 మంది మట్టి తవ్వకాలకు వచ్చినట్లు హాజరులో చూపించారు, తనిఖీ అధికారులకు 15 మందే కనిపించారు. దీనికితోడు ఒక్కో మస్టర్‌కు రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.



ఒకే ఫోటోతో మూడు మస్టర్‌లు

పశ్చిమ ప్రకాశంలోని బేస్తవారిపేట, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు, అర్ధవీడు, కొనకనమిట్ల మండలాల్లో దొంగ మస్టర్లు ఎక్కువగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత



వైఎస్సార్ సీపీ విద్యుత్ ప్రభపై మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, మేరుగు నాగార్జున, ఆరె శ్యామల, చుండూరి రవి



విద్యుత్ ప్రభ వద్ద కిక్కిరిసిన జనం

- 11 నెలల్లోనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు
- సూపర్ సిక్స్ హామీలిచ్చి నెరవేర్చని చంద్రబాబు
- పేదలు, మహిళలను మోసం చేయడం అన్యాయం
- మళ్లీ జగనన్నను సీఎం చేసుకుందాం
- ఇచ్చిన మాట నెరవేర్చే వ్యక్తి జగనన్న
- సంక్షేమ పథకాలతో పేద ప్రజలకు అండగా నిలిచారు
- రాష్ట్రానికి మళ్లీ జగనన్నే కావాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

చీమకుర్తి రూరల్: ఒకసారి ప్రజలకు మాటిస్తే కచ్చితంగా నెరవేర్చే వ్యక్తి వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. కానీ, సీఎం చంద్రబాబు గత ఎన్నికల సమయంలో ప్రజలకు సూపర్ సిక్స్ హామీలిచ్చి నెరవేర్చకుండా మోసం చేశారని మండిపడ్డారు. అందుకే కూటమి ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. చీమకుర్తి మండలంలోని కూనంనేనివారిపాలెం గ్రామంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి నిర్వహించిన తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభపై బూచేపల్లి పాల్గొన్నారు. పమిడి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించగా, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవితో కలిసి పాల్గొన్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనీవినీ ఎరుగని రీతిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల పేద ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా జగనన్న అండగా నిలిచారని తెలిపారు. ఎన్ని కష్టాలొచ్చినా మనమంతా సమష్టి కృషితో మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని అన్నారు.

వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రం సస్యశ్యామలం : మేరుగు నాగార్జున

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా ఉంటుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున అన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో కులమతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రజలకు అందాయన్నారు. నేడు కూటమి ప్రభుత్వంలో పేద ప్రజలు, మహిళల గురించి పట్టించుకునేవారే లేరన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలివ్వకపోవడంతో నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కొనుగోలు చేయకుండా అన్నదాతలను నిలువునా మోసం చేస్తోందన్నారు. ప్రజలంతా 2029 ఎన్నికల్లో చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని అన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆరె శ్యామల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా.. ఇచ్చిన హామీల ఊసే లేదన్నారు. స్కీములు లేకపోగా, స్కాములు మాత్రం ఉంటున్నాయన్నారు. అధికారం ఉన్నా..లేకున్నా జగనన్న సింగిల్‌గా పోటీచేసే దమ్మున్న నాయకుడని అన్నారు. పార్టీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేసి 2029లో జగనన్నను సీఎం చేసుకుంటేనే పేద ప్రజలకు అండగా దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నం శ్రీధర్, సంతనూతలపాడు మండల అధ్యక్షుడు దుంపా చెంచిరెడ్డి, నాయకులు శివన్నారాయణ, యర్రగుంట్ల వసంతరావు, యర్రగుంట్ల మోహన్, డాక్టర్ బొడ్డపాటి హరిబాబు, నల్లూరి నారాయణ, నల్లూరి చంద్రారావు, గోరంట్ల రామకృష్ణ, వేమూరి బాలకృష్ణ, పేరాబత్తిన పేరయ్య, పాటిబండ్ల గంగయ్య, ఏలూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లపై కర్రపెత్తనం తగదు

- ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి



ఆశా వర్కర్ల జిల్లా సదస్సులో ప్రసంగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి

ఒంగోలు టౌన్: ఆశా వర్కర్లపై కర్రపెత్తనం తగదని, ఏఎన్ఎంల నుంచి మొదలుకుని ఉన్నతాధికారుల వరకు పెత్తనం చలాయిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి అన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన యూనియన్ జిల్లా సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఆశా వర్కర్ల సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించకపోయినప్పటికీ ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించిందని చెప్పారు. కోవిడ్ సమయంలో ఆశాలు అందించిన సేవలను ప్రజలు ప్రశంసించారన్నారు. 20 ఏళ్లుగా ఎన్‌హెచ్ఎం విభాగంలో ఆరోగ్య సేవలందిస్తున్నారని, ప్రతి కాన్పు ఆస్పత్రిలో జరిగే విధంగా కృషి చేస్తున్నారని తెలిపారు. 2007లో యూనియన్ ఏర్పడిన తర్వాత జీతాల కోసం చేసిన ఉద్యమం ఫలితంగా చంద్రబాబు ప్రభుత్వం 3 వేల రూపాయల జీతం ప్రకటించిందన్నారు. ఆ తర్వాత వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 10 వేల రూపాయలకు పెంచి ఇచ్చిందని తెలిపారు. ఆశాలకు నిర్దిష్టమైన పని విధానం రూపొందించకపోవడం విచారకరమన్నారు. నిర్దిష్టమైన పని గంటలు, సెలవులు అమలు కాకపోవడం, ఉద్యోగ భద్రత, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించకపోవడం వంటి అనేక సమస్యలు వేధిస్తున్నాయని చెప్పారు. ఉదయం, సాయంత్రం ఇంటింటికి తిరిగి సర్వేలు చేయమని, వెల్నెస్ సెంటర్లలో పనిచేయమని ఒత్తిళ్లు చేస్తున్నారని చెప్పారు. దీంతో ఆశా వర్కర్లు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సేవలు అందించినప్పటికీ ఆశావర్కర్లు రిటైర్డ్ అయినా, మరణించినా ఎలాంటి సహాయం అందకపోవడం దారుణమన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి పెండ్యాల కల్పన ప్రసంగిస్తూ వేతనాలు లేకుండా 14 ఏళ్లపాటు పనిచేశారని, 14 ఏళ్ల ఉద్యమం తరువాత వేతనాలు సాధించామని చెప్పారు. ఉద్యోగ భద్రత కోసం మరోసారి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మే 20న జరిగే సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల ఉద్యమానికి ఐద్వా అండగా నిలుస్తుందని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి చెప్పారు. కార్యక్రమంలో కాలం సుబ్బారావు, జీవీ కొండారెడ్డి, శేషయ్య, రమేష్, అరుణ, అనూష, సిఫోరా, విజయ, కోటేశ్వరి, నాగమ్మ, విశ్రాంతమ్మ, సుశీల, బాలమ్మ, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం తనిఖీలు



పాలేటిపాడులో ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కేంద్ర గణాంక బృందం సభ్యులు

- ఈ క్రాప్ నమోదు, తదితర అంశాలపై పలు ప్రాంతాల్లో తనిఖీ

జరుగుమల్లి (సింగరాయకొండ): జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం కేంద్ర బృందం తనిఖీలు చేపట్టింది. జరుగుమల్లి మండలంలోని పాలేటిపాడు గ్రామంలో ఈ క్రాప్ నమోదుపై కేంద్ర గణాంక బృందం అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రాప్ నమోదు సక్రమంగా జరిగిందా..లేదా..? అనే విషయాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర గణాంక అధికారి జేవీ శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి 5 సర్వే నంబర్లు ఎంపిక చేసి వాటిలోని భూముల్లో రైతులు ఏయే పంటలు వేశారు.. ఆ భూముల్లో రెవెన్యూ, వ్యవసాయ అధికారులు ఏయే పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేశారనే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. పంటలు వేయని భూములు వాస్తవమేనా అని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో పంటల నమోదును పరిశీలిస్తామని బృంద సభ్యులు వివరించారు. తనిఖీ బృందం వెంట మండల వ్యవసాయ అధికారి యుగంధర్‌రెడ్డి, సూపరింటెండెంట్ రామకృష్ణ, ఏఎస్ఓ సుబ్రహ్మణ్యం, వీఆర్ఓ రాకేష్, గ్రామ వ్యవసాయ సహాయకుడు రామస్వామి పాల్గొన్నారు.

మర్లపాడు గ్రామంలో తనిఖీలు...

టంగుటూరు: మండలంలోని మర్లపాడు గ్రామంలో పంటల విస్తీర్ణంపై గురువారం కేంద్ర బృందం తనిఖీలు నిర్వహించింది. గ్రామంలోని రైతుల పొలాల్లో కేంద్ర, రాష్ట్ర గణాంకాల అధికారులు వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందితో కలిసి వ్యవసాయ భూములు, భూ కమతాల వినియోగంపై ఉమ్మడి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర బృంద అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ మర్లపాడు గ్రామానికి సంబంధించిన వ్యవసాయ కమతాలలో ఏఏ పంటలను రైతులు పండించారు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయా..లేదా..? ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను సేకరించామని వివరించారు. వీఏఏలు ఈ క్రాప్‌లో నమోదు చేసిన పంటలకు, పంట పొలాల్లో ఉన్న పంటలకు మధ్య అంతరాన్ని నమోదు చేసి వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు సలహాలు, సూచనలు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసరావు, సీనియర్ గణాంకాధికారి రామకృష్ణ, డిప్యూటీ ఎస్ఓ సీపీఓ ప్రసాద్‌రావు, ఏవో స్వర్ణలత, మండల సహాయ గణాంకాధికారి శ్రీవాణి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సౌమ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఒంగోలు అధ్యక్షునిగా శంకర్



ఒంగోలు టౌన్ : వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అధ్యక్షునిగా కటారి శంకరరావును ఎంపిక చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గురువారం ఒంగోలు నగర కమిటీని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కోడూరి కిషోర్, కొణికి రోశయ్య, జనరల్ సెక్రటరీలుగా దుగ్గిరెడ్డి జయరామిరెడ్డి, షేక్ మూసా, ఆవుల వెంకట సురేంద్ర, అంబటి అర్జున్, నెరుసుల రామకృష్ణను ప్రకటించారు. అలాగే కార్యదర్శులుగా పల్లపోతుల వెంకయ్య నాయుడు, షేక్ రమిజా, తేళ్ల అవినాష్, ఆవుల రవితేజ, నంద్యాల సాయిరెడ్డి, తోటపల్లి రవి, కొక్కిలిగడ్డ వెంకటేశ్వర్లు, పానుగోటి రాజేశ్వరి, షేక్ అబ్దుల్ సలాం, గోనెల శివకుమార్‌ను నియమించారు. వీరితో పాటు 37 మంది ఎగ్జిక్యూటివ్ మెంబర్లను నియమించారు.

అనుబంధ విభాగాల అధ్యక్షుల ఎన్నిక...

వైఎస్సార్ సీపీ ఒంగోలు నగర అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టారు. పార్టీ యువజన విభాగం అధ్యక్షునిగా కాకుమాను సునీల్ రాజ్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా బత్తుల ప్రమీల, బీసీ సెల్ అధ్యక్షునిగా సూతరం శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షునిగా పసుమర్తి గోపీచంద్, ఎస్టీ సెల్ అధ్యక్షునిగా గాలేటి వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ అధ్యక్షునిగా మహమ్మద్ చాన్‌బాషాలను నియమించారు. క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా కావూరి కృపాకిరీటి, విద్యార్థి విభాగం అధ్యక్షునిగా సయ్యద్ ఖాదర్ బాషా, మున్సిపల్ విభాగం అధ్యక్షునిగా షేక్ రషీద్ నాగూర్, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షునిగా తోటా సుధారాణి, వలంటీర్ల విభాగం అధ్యక్షునిగా అబ్దుల్‌ఖుద్దూస్‌ను నియమించారు. గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షునిగా షేక్ హిదాయతుల్లా, వాణిజ్య విభాగం అధ్యక్షునిగా ఏ యలమందారెడ్డి, చేనేత విభాగం అధ్యక్షునిగా మొగిలి ఆనందరావు, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షునిగా మిర్యాల శ్రీనివాసరావు, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా బదుగు ఇందిర, లీగల్ సెల్ అధ్యక్షునిగా కాకటూరి సంపత్ కుమార్, కల్చరల్ విభాగం అధ్యక్షునిగా పఠాన్ సమీర్‌ఖాన్, సోషల్ మీడియా అధ్యక్షునిగా చావల పీటర్‌పాల్, ఐటీ విభాగం అధ్యక్షునిగా ఉల్లగంటి సతీష్ కుమార్, దివ్యాంగుల విభాగం అధ్యక్షునిగా షేక్ మీరావలి, డాక్టర్స్ విభాగం అధ్యక్షునిగా కొల్లం దీపక్ సాహిత్య, పబ్లిసిటీ విభాగం అధ్యక్షునిగా పిగిలి శ్రీనివాసరావును నియమించారు.

క్లుప్తంగా

రెండు ఎంపీయూపీ పాఠశాలలను యథావిధిగా ఉంచండి

● డీగ్రేడ్ చేయవద్దంటూ హైకోర్టు స్టేటస్ కో

సీఎస్పురం(పామూరు): సీఎస్పురం మండలంలోని కోవిలంపాడు, పెదగోగులపల్లె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలను డీగ్రేడ్ చేయకుండా ప్రస్తుతానికి యథావిధిగా కొనసాగించాలని హైకోర్టు ఆదేశించింది. ఆయా పాఠశాలలను డీగ్రేడ్ చేయవద్దంటూ ఎస్ఎంసీ చైర్మన్లు, గ్రామస్తులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జూన్ 27న విచారణ ఉన్నందున అంతవరకు రెండు పాఠశాలలను డీగ్రేడ్ చేయకుండా యథావిధిగా కొనసాగించాలని కోర్టు స్పష్టం చేసింది.

రైలు ఢీకొని వ్యక్తి మృతి



రమణారెడ్డి (ఫైల్)

కురిచేడు: రైలు దూసుకొస్తున్న సమయంలో పట్టాలు దాటేందుకు ప్రయత్నించిన ౖఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని కాటంవారిపల్లె వద్ద గురువారం చోటుచేసుకుంది. వివరాలు.. కాటంవారిపల్లె గ్రామానికి చెందిన సంగు రమణారెడ్డి(55) గురువారం వేకువ జామున పట్టాలు దాటే క్రమంలో రైలు ఢీకొంది. నరసరావుపేట రైల్వే ఎస్సై శ్రీనివాసనాయక్ తమ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రమణారెడ్డి మృతిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

గిద్దలూరు రూరల్: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతోపాటు పరిహారం కింద రూ.లక్ష చెల్లించాలని గిద్దలూరు అడిషనల్ జ్యుడీషియల్ సివిల్ జడ్జి కె.భరత్‌చంద్ర గురువారం తీర్పునిచ్చారు. జె.పంగులూరు మండలానికి చెందిన ఎస్.ఎస్ స్మార్ట్ టెక్నాలజీ ప్రొప్రైటర్ నాగార్జున కంభంకు చెందిన ఎస్.శ్రీనివాసులు వద్ద ఏడేళ్ల క్రితం రూ.లక్ష అప్పు తీసుకున్నాడు. బాకీ చెల్లింపు నిమిత్తం ఇచ్చిన చెక్కును శ్రీనివాసులు బ్యాంక్‌లో వేయగా బౌన్స్ అయింది. దీంతో నాగార్జునపై కోర్టులో కేసు వేయడంతో తుది విచారణ చేపట్టిన జడ్జి పైన పేర్కొన్న విధంగా తీర్పు వెల్లడించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

● ఇద్దరు చిన్నారులకు గాయాలు



పిచ్చికుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన సాయి

తాళ్లూరు: పిచ్చికుక్క స్వైర విహారం చేసి పలువురిని గాయపరిచిన సంఘటన తాళ్లూరు మండలం మాధవరం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన సాయి అనే బాలుడి తల, గొంతు వద్ద పిచ్చికుక్క కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. శ్రీలక్ష్మి అనే బాలికను పిచ్చికుక్క కరుస్తున్న సమయంలో పక్కనే ఉన్న స్థానికులు కేకలు వేసి తరిమికొట్టడంతో పారిపోయింది. క్షతగాత్రులను తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. సాయి తీవ్రంగా గాయపడటంతో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.



గాయాన్ని చూపుతున్న శ్రీలక్ష్మి

ఆదాయం పావలా.. హడావుడి చాలా!



క్లబ్ రోడ్డులో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

హైవేపై దూసుకెళ్లాల్సిన ఆర్టీసీ బస్సు ఇలా ఇరుకు వీధిలో తిరుగుతోంది ఏమిటని అనుకుంటున్నారా? ఈ బస్సు రోజూ ఇంతే తిరుగుతుంది! గిద్దలూరు ఆర్టీసీ డిపోకు రోజువారీగా వచ్చే సుమారు రూ.10 లక్షల ఆదాయాన్ని స్థానిక ఎస్‌బీఐలో డిపాజిట్ చేసేందుకు ఆర్టీసీ బస్సును వినియోగిస్తున్నారు. అయితే మంచిదే కదా అని అనుకుంటే పొరపాటే. ఇరుకు వీధిలో ఆర్టీసీ బస్సును తిప్పుతుండటంతో నగర వాసులకు రోజూ ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నగదుతో కూడిన బాక్స్‌ను గన్‌మెన్, క్యాషియర్ కలిసి రోజూ బస్సులో వెళ్లి తిరిగి డిపోకు చేరుకోవడం సవాల్‌గా మారుతోంది. ఇరుకు వీధిలో పార్కింగ్ చేసిన వాహనాలను అడ్డు తొలగించాలని డ్రైవర్ బతిమాలుకోవాల్సి వస్తోంది. పోనీ ఆర్టీసీ బస్సు ఏమైనా నేరుగా బ్యాంక్ వద్దకు వెళ్తుందా అంటే అదీ లేదు. బ్యాంక్ సమీపంలోనే బస్సు నిలిపేసి అక్కడి నుంచి నగదు బాక్స్‌ను మోసుకెళ్తున్నారు. ఈలోగా బస్సు యూటర్న్ చేసుకోవడానికి 15 నిమిషాల సమయం పడుతోంది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే బైకులు, కార్లు, ఆటోలు నిలిచిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి జీపులో నగదు తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని నగర పౌరులు కోరుతున్నారు.

- గిద్దలూరు రూరల్

మర్కటంగారి.. పానీ కహానీ..



ఏమిటో ఈ ఎండ..



అరెరే నీళ్లు రాలేదే..

ఎండ దెబ్బకు ఠారెత్తిపోయిన ఓ మర్కటం దప్పిక తీర్చుకునేందుకు నానాపాట్లు పడింది. నీళ్ల ట్యాంక్‌పై కూర్చుని ఇది ప్రదర్శించిన హావభావాలు చూసినవారు కాసేపు ఆశ్చర్యచకితులయ్యారు. భక్తులు ఇచ్చిన ఆహారం తాపీగా తినేసిన తర్వాత ఎవరైనా గుక్కెడు నీళ్లు పోయకపోరా అని ఎదురుచూసింది. అంతలోనే ఇక లాభం లేదనుకుని ట్యాంక్ వద్ద కుప్పిగంతులేసి ఓ కుళాయి తిప్పి దాహం తీర్చుకుంది. ఈ దృశ్యాలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వద్ద 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.

- కొనకనమిట్ల



ట్యాప్ తిప్పితే పోలా..



హమ్మయ్యా దప్పిక తీరింది

సాగు పేరుతో భూమి.. చేస్తున్నదేమి?

● దేవదాయ శాఖ భూమిలో అక్రమ కట్టడాలు
● పంక్చర్ షాపు, హోటల్ ఏర్పాటు చేసి భారీ మొత్తంలో అద్దె వసూలు
● కూటమి నాయకుడి నిర్వాకంపై నోరు మెదపని అధికారులు
● విద్యుత్ కనెక్షన్ దరఖాస్తుతో విషయం వెలుగులోకి.

సింగరాయకొండ:

సాగు చేసుకోవడానికి దేవదాయ శాఖ భూమిని వేలంలో దక్కించుకున్న వ్యక్తి ఒక్క పంట పండించలేదు. ఆ స్థలంలో దర్జాగా షాపులు నిర్మించడమే కాకుండా అద్దెకిచ్చి అదనంగా సొమ్ము చేసుకుంటున్నాడు. ఇంత జరుగుతున్నా దేవదాయ శాఖ అధికారులు చోద్యం చూడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పాత సింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి మూలగుంటపాడు పంచాయతీ సర్వే నంబర్ 44–1బీలో 0.84 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. జాతీయ రహదారిపై ఎయిర్ బేస్ పక్కనే ఉండటంతో ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో కోట్ల రూపాయలు పలుకుతోంది. గత ఏడాది దేవదాయ శాఖ అధికారులు నిర్వహించిన వేలంలో కలికవాయ గ్రామానికి చెందిన కూటమి సానుభూతిపరుడు ఈ భూమిని దక్కించుకున్నాడు. మూడేళ్ల పరిమితితో ఏడాదికి 2,500 రూపాయల చొప్పున కౌలు చెల్లించాలనేది నిబంధన. ఈ సంగతి పక్కనబెడితే.. కౌలుకు తీసుకున్న వ్యక్తి ఆ భూమిలో పంటలు పండించకుండా షాపులు ఏర్పాటు చేసి అద్దెకివ్వడం ప్రారంభించాడు. కరెంట్ మీటరు ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు దరఖాస్తు చేయడంతో అసలు విషయం బట్టబయలైంది.



దేవదాయ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడాలు

దేవదాయ శాఖ భూమిలో ప్రస్తుతం ఒక పంక్చర్ షాపు, హోటల్ ఏర్పాటు చేసి భారీగా అద్దె వసూలు చేస్తున్న సదరు నాయకుడు.. మిగిలిన స్థలాన్ని సాగు చేయకుండా ఖాళీగా వదిలేశాడు. వాస్తవానికి సాగు కోసం తీసుకున్న భూమిలో ఎటువంటి కట్టడాలు నిర్మించకూడదు. నిబంధనలు అతిక్రమిస్తే లీజును రద్దు చేసే హక్కు ఆలయ అధికారులకు ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ఇటీవల ఆలయ అధికారులు సదరు వ్యక్తి వద్దకు వెళ్లి దుకాణాలు తొలగించాలని వేడుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వేలం రద్దు చేసి స్థలాన్ని స్వాధీనం చేసుకోకుండా బతిమాలడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై దేవస్థానం ఈఓ పి కృష్ణవేణిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించినప్పటికీ ఆమె స్పందించలేదు.

1.60 కేజీల గంజాయి పట్టివేత!



గంజాయి నిందితులతో ఎక్సైజ్ అధికారులు

పుల్లలచెరువు: మండలంలోని ఐటీ వరం పరిసరాల్లో బుధవారం సాయంత్రం 1.60 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేయడంతో నిందితులు దొరికిపోయినట్లు తెలుస్తోంది. రెండు బైకులపై వెళ్తున్న ముగ్గురు వ్యక్తులను ఐటీ వరం సమీపంలో తనిఖీ చేయగా 1600 గ్రాముల గంజాయి లభ్యమైందని ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని తెలిపారు. ముగ్గురు నిందితులను మార్కాపురం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కాగా పుల్లలచెరువు మండలంలోని పలు తండాల్లో మద్యం బెల్ట్ షాపులు, నాటుసారా విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. వీటికి తోడు కొత్తగా గంజాయి వ్యాపారం కూడా ప్రారంభం కావడం తీవ్ర చర్చనీయాంశమైంది.

రెండు కేజీల గంజాయి స్వాధీనం?

బేస్తవారిపేట: నియోజకవర్గంలోని బేస్తవారిపేట, మోక్షగుండం, కంభంలో పలువురి వద్ద రెండు కేజీల కంభం సీఐ మల్లికార్జున స్వాధీనం చేసుకున్నారు. కంభంలో గంజాయి అమ్ముతున్న ఒకరిని అదుపులోకి తీసుకోవడంతో గంజాయి స్మగ్లింగ్ వ్యాపారం వెలుగులోకి వచ్చింది. బేస్తవారిపేట మండలంలోని మోక్షగుండంలో ఒకరు, బేస్తవారిపేటలో ఇద్దరు, కంభంలో ఏడుగురు గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇప్పటికే వీరిలో కొంతమందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుల నుంచి రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని లోతుగా విచారణ చేపడుతున్నారు.

ఆగి.. సాగిన పొగాకు వేలం

● గిట్టుబాటు ధర లేదని వేలాన్ని బహిష్కరించిన రైతులు
● సర్దిచెప్పి మధ్యాహ్నం తర్వాత కొనసాగించిన బోర్డు అధికారులు
● అయినా సరైన ధర ఇవ్వకపోవడంపై రైతుల తీవ్ర ఆగ్రహం
● వేలంలో అరకొరగా పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు

కనిగిరి రూరల్: ధరల దోబూచులాటలో పొగాకు రైతులు విలవిల్లాడుతున్నారు. గురువారం కనిగిరి పొగాకు వేలం కేంద్రంలో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమైన కాసేపటికే వేలం నిలిచిపోయింది. గిట్టుబాటు ధర దక్కకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేలాన్ని బహిష్కరించారు. అలవలపాడు క్లస్టర్ పరిధిలోని 7 గ్రామాల నుంచి సుమారు 403 పొగాకు బేళ్లను రైతులు తీసుకొచ్చారు. వేలంలో పాల్గొన్న వివిధ కంపెనీల ప్రతినిధులు, బయ్యర్లు ఒకటీరెండు బేళ్లకు కేజీ రూ.280 ధర ఇచ్చి.. మిగిలిన వాటిని రూ.240 చెల్లిస్తూ వచ్చారు. సుమారు 50 బేళ్లకు ఇదే ధర కొనసాగడం రైతులకు ఆగ్రహం తెప్పించింది. ఎఫ్1, ఎఫ్2 మంచి రకం బేళ్లకు కూడా రూ.230, రూ.240కి మించి ధర ఇవ్వక పోవడంతో రైతులు మూకుమ్మడిగా వేలాన్ని నిలిపేశారు. బయ్యర్లు, కంపెనీల ప్రతినిధులు కుమ్మక్కై.. ధర లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ తరుణంలో రైతులు, కంపెనీ బయ్యర్లతో బోర్డు అధికారులు సమావేశం నిర్వహించినా ఫలితం లేకుండా పోయింది. ఉదయం ఆగిన పొగాకు వేలం బోర్డు అధికారుల బుజ్జగింపులతో మధ్యాహ్నం తర్వాత మళ్లీ కొనసాగింది. మొత్తం 403 బేళ్లకుగాను 51 బేళ్లు నోబిడ్ కింద నిలవగా, మిగతా వాటిని కొనుగోలు చేశారు. గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర రూ.200, సరాసరి ధర రూ.230 పలికిందని వేలం నిర్వహణాధికారి కోటేశ్వరరావు తెలిపారు. సుమారు 9 కంపెనీల ప్రతినిధులు వేలం కేంద్రం వద్దకు వచ్చినా.. మూడు కంపెనీలు మాత్రమే కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన 353 బేళ్లలో గరిష్ట ధర పలికినవి 25కు మించి లేవని రైతులు పెదవి విరిచారు. పొగాకుకు కనీస మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వ విఫలమైందని రైతు సంఘం నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



ఉదయం వేలం ఆగడంతో నిలిచిన పొగాకు బేళ్లు



మధ్యాహ్నం నుంచి కొనసాగుతున్న పొగాకు వేలం

పొగాకు రైతుల గోడు పట్టదా?

● కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఏపీ రైతు సంఘం ఆగ్రహం

ఒంగోలు టౌన్: వ్యాపారుల తీరుతో కష్టనష్టాలు చవిచూస్తున్న పొగాకు రైతులను ఆదుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి గురువారం ఒక సంయుక్త ప్రకటనలో విమర్శించారు. మిర్చి పంట సాగు చేసి తెగుళ్ల వల్ల సరైన దిగుబడి రాక, ధర లేక నష్టపోయిన రైతులు.. ప్రత్యామ్నాయ పంటగా బర్లీ, వర్జీనియా పొగాకు పండించారని తెలిపారు. క్వింటాకు 15 వేల రుపాయలు తక్కువ కాకుండా తీసుకుంటామని చెప్పిన పొగాకు కంపెనీల ప్రతినిధులు తీరా పంట చేతికొచ్చాక మొహం చాటేయడం దారుణమని మండిపడ్డారు. తీవ్ర ఆందోళనకు గురైన రైతులు సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల బాధ తట్టుకోలేక ఇప్పటికే ఇద్దరు పొగాకు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, మరో రైతు ఆత్మహత్యాయత్నం చేశారని తెలిపారు. వర్జీనియా పొగాకు కొనుగోళ్లు ఇప్పటికీ ప్రారంభించకపోవడం సరికాదని, రోజుకు రెండుమూడొందల బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయని, పచ్చ మాడును పూర్తిగా కొనుగోలు చేయడం లేదని పేర్కొన్నారు. మేలు రకం పొగాకుకు సరైన ధర ఇవ్వకపోతున్నా టుబాకో బోర్డు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. జిల్లా ప్రజాప్రతినిధులు తూతూ మంత్రంగా సమావేశాలతో సరిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2015లో నాటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పొగాకు రైతులు తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోవడంతో 18 మందికి పైగా ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తు చేశారు. గత చేదు అనుభవాలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మేలుకోవాలని, తక్షణమే ప్రభుత్వరంగ సంస్థలను రంగంలోకి దింపి పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కర్రల ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

● మహిళ మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
● గుట్లపల్లి వద్ద జాతీయ రహదారిపై ఘటన



సంఘటన స్థలంలో ట్రాక్టర్, కారు

త్రిపురాంతకం: కర్రల లోడ్ వెళ్తున్న ట్రాక్టర్‌ను మార్జిన్ గమనించక కారు ఢీకొట్టడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన త్రిపురాంతకం మండలంలోని గుట్లపల్లి వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు.. కురిచేడు మండలంలోని మృత్యుంజయపురం గ్రామానికి చెందిన వజ్రగిరి కొండమ్మ(45), కొదమల కుమారి, షారోన్, ప్రశాంత్‌రాజ్ పుల్లలచెరువు మండలంలోని చౌటపాచర్ల గ్రామంలో బంధువుల ఇంట శుభ కార్యానికి హాజరయ్యారు. కారులో స్వగ్రామానికి బయలుదేరిన వీరు మార్గమధ్యంలో గుట్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న కర్రల లోడ్ ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. వజ్రగిరి కొండమ్మ అక్కడికక్కడే మృతి చెందగా, మిగిలిన ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రిపురాంతకం పోలీసులు తెలిపారు.

తెల్ల గ్రానైట్ మైనింగ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ



మాట్లాడుతున్న మైనింగ్ అధికారి శ్రీనివాస్

హనుమంతునిపాడు: మండల కేంద్రమైన హనుమంతునిపాడు రెవెన్యూ సర్వే నంబర్ 299లో తెల్ల గ్రానైట్ మైనింగ్‌కు సంబంధించి జిల్లా మైనింగ్ అధికారులు, జిల్లా పర్యావరణ అధికారులు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. గురువారం తహసీల్దార్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో మైనింగ్ నిర్వహించే ప్రదేశంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనింగ్ శాఖ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హనుమంతునిపాడు పంచాయతీ సర్వే నంబర్ 299లో 21 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న ఎర్ర కొండ(బొల్లిగుండ్ల కొండ)లో వైట్ గ్రానైట్ తవ్వకాలకు మిడ్‌వెస్ట్ కంపెనీ 2018లో ఎన్‌ఓసీ పొందిందని తెలిపారు. గత ఏడాది మే నెలలో గనుల తవ్వకానికి మైనింగ్ శాఖ అనుమతి ఇచ్చిందని చెప్పారు. మైనింగ్‌తో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వెంకట సుబ్బయ్య, గంటా రాఘవేంద్రరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. రోడ్లు నిర్మించడంతోపాటు గుర్రప్పుడు ఆలయానికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. గుడి పక్కన తవ్వకాలు చేపట్టవద్దని, పక్కనే ఉన్న పశువుల కుంటను అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ అధికారి జి.రాఘవరెడ్డి, ఆర్ఐ గవదకట్ల కృష్ణ చైతన్య, సర్వేయర్ రమణయ్య, వీఆర్వోలు చిన్నయ్య, కాశయ్య, బాదుల్లా, ఝాన్సీ, రసూల్, మిడ్‌వెస్ట్ కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

బేస్తవారిపేట: స్కూటీని గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం రాత్రి బేస్తవారిపేట బస్టాండ్‌లో చోటుచేసుకుంది. స్కూటీపై జంక్షన్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తిని ఓ వాహనం ఢీకొట్టింది. దీంతో ఆ వ్యక్తి తలకు తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. పలుమార్లు 108కు సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో ఆటోలో కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రుడి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

